క్లుప్తంగా

'అగ్ని' బాధితుడిని పరామర్శించిన డాక్టర్ 'గజ్జల'



నకరికల్లు: అగ్ని ప్రమాదబాధిత కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. నకరికల్లుకు చెందిన జూలకంటి సతీష్ ఫ్యాన్సీదుకాణం, ఇంట్లో సంభవించిన అగ్నిప్రమాదంలో భారీనష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం నకరికల్లుకు వచ్చి బాధితునితో మాట్లాడారు. ప్రమాదం తీరును అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరఫునఅండగా నిలుస్తామని భరోసానిచ్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, రుసుం శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం

పెదకూరపాడు: పెదకూరపాడులో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ సూచనలతో ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సమన్వయంతో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున, మండల పీహెచ్‌సీ వైద్యాధికారి ఉడుముల వెలుగొండ రెడ్డి, మండల హెల్త్ సూపర్‌వైజర్ బండారు శ్రీనివాసరావులు గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారికి పింఛన్ వస్తుందో లేదో అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ వెలుగొండ రెడ్డి చిన్నారుల పరిస్థితిని పరిశీలించి వారి తల్లిదండ్రులకు ఆరోగ్య సూచనలు చేశారు. పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి, ఆరోగ్య కార్యకర్తలు పాటిబండ్ల అనుష కుమారి, జలవరమ్మ, గుడిపూడి రాణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సత్తెనపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గుంటూరురోడ్‌లో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో సోమవారం శివరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, కలశ స్థాపన కార్యక్రమాలను ఆశ్రమం వంశ పారంపర్య ధర్మకర్త మాతాధిపతులు లలితాంబ మాతాజీ ఆధ్వర్యంలో ఋత్వికులు నిర్వహించారు. మంగళవారం గణపతి, సుబ్రహ్మణ్య రుద్రహోమం, బుధవారం శివ పార్వతుల కళ్యాణం, అన్నదానం జరుగుతాయని మాతాజీ తెలిపారు.

శ్మశానంలో ముళ్ల కంప తొలగింపు

సాక్షి స్పందన

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని హిందూ శ్మశానంలో సోమవారం ముళ్ల కంప తొలగింపు పనులు పూర్తి చేశారు. 'ముళ్ల చెట్లు తొలగించరూ..!' అంటూ 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన ఫొటో కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈఓపీఆర్డీ ఆదేశాల మేర పొక్లెయిన్ సాయంతో కంపచెట్లను తొలగించి, శ్మశానం చుట్టూ ఉన్న పేడదిబ్బలను తొలగించినట్లు పంచాయతీ సర్పంచ్ పీలా గాయత్రీలక్ష్మణ్ తెలిపారు. అలాగే పక్కనే చేతిపంపునకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

సత్తెనపల్లి: విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రానున్న విద్యా సంవత్సరంలో విద్యాబోధనలో మార్పులు తీసుకొస్తామని ప్రగతి విద్యా సంస్థల డైరెక్టర్ దగ్గుబాటి శివ బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని నూతన యజమాన్య పర్యవేక్షణలో ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాల వీడ్కోలు వేడుకల్లో సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శివ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఎంసెట్, జేఈఈ మెయిన్స్ లక్ష్యంగా విద్యాబోధనలో మార్పులు తీసుకొస్తామన్నారు. సీఈసీ గ్రూపులో పట్టణ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన సౌమ్యశ్రీ భాయ్ కి, ప్రతి గ్రూపులో టాపర్ గా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఓ.శ్రీనివాసచారి, మాచిబట్టు సుబ్బరాజు, షేక్ జానీ బాషా, యు.సోమేశ్వరరావు, డేగల శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గంలో నడుద్దాం

అచ్చంపేట: సర్వమానవాళి క్షేమం కొరకు, సుఖసంతోషాల కోసం ప్రతి ఒక్కరూ ప్రభువైన ఏసుక్రీస్తు మార్గంలో నడవాలని ఏఈఎల్‌సీ మోడరేటర్ బిషప్ కె.ఎఫ్.పరదేశి బాబు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సెయింట్‌పాల్ ఎఫిఫానియా శతవార్షిక లూథరన్ దేవాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ పరదేశిబాబు బైబిల్ పఠనం చేసి ఏసు మార్గాన్ని వివరించారు. మధ్యమ గుంటూరు సినడ్ బిషప్ రైట్ రెవ.డాక్టర్ ఎస్‌జే బాబూరావు, ఫాదర్లు జేమ్స్, డేగల రత్నం, కె.ఆర్నాల్డ్ మోజెస్, చిన్న కిషోర్‌బాబు, బొల్లెద్దు మ్యాథ్యూస్, కె.రవితేజ పాల్గొన్నారు.

శంభో శివ శంభో..!

- మహాశివరాత్రికి పురాతన ఆలయాలు ముస్తాబు
- చేజర్లలో స్వయంభువుగా వెలసిన కపోతేశ్వరస్వామి
- మునీశ్వరులచే ప్రతిష్ఠితమైన నర్సింగపాడు గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం
- భక్తుల నీరాజనాలు అందుకుంటున్న స్వామివార్లు





చేజర్ల గ్రామంలోని కపోతేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్) కపోతేశ్వరస్వామి వారు



నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారు

నకరికల్లు: మహాశివరాత్రికి మండలంలోని ప్రముఖ ఆలయాలు ముస్తాబయ్యాయి. దక్షిణ కాశీ ఆలయాలుగా ప్రసిద్ధి కెక్కి శతాబ్దాల నాటి చరిత్ర కలిగి భక్తులచే నీరాజనాలు అందుకుంటున్న ప్రముఖ ఆలయాలను పర్వదినం సందర్భంగా రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. తరలివచ్చే భక్తులు స్వామివార్లను ప్రశాంతంగా దర్శించుకునే వీలుగా ఏర్పాట్లు చేశారు. ఏటా మహాశివరాత్రి పర్వదినాన విశేషపూజలు నిర్వహించే ప్రముఖ ఆలయాలు పల్నాడు జిల్లా నకరికల్లు మండలంలోని చేజర్ల, నర్సింగపాడు గ్రామాల్లో కొలువుదీరి ఉన్నాయి. పల్నాడు ప్రాంతానికే ఈ ఆలయాలు ఆధ్యాత్మికను జోడించాయి.

పురాతన కపోతేశ్వరస్వామి ఆలయం

క్రీస్తు శకం 2వ శతాబ్దం నాటి ఈ ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది. కాశ్మీర దేశ చక్రవర్తిగా ఉన్న నాటి శిబి చక్రవర్తి చేజర్లలోని ఆలయంలో నూరుయాగాలు చేశారని, ఆయన దానగుణాన్ని, త్యాగనిరతిని గుర్తించేందుకు త్రిమూర్తులు ఇక్కడ శిబి చక్రవర్తికి పరీక్ష పెట్టగా పరీక్షలో త్రిమూర్తుల అనుగ్రహం పొందినట్లు చరిత్ర. ఈ ఆలయంలో నూటొక్క శివ లింగాలు ఉన్నట్లు భక్తులు చెబుతారు. దేవాలయం రెండు కిలోమీటర్లదూరంలో కొండపై అతిపురాతనమైన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంటుంది. కొండపై మరో వైపు మేఘాల మల్లయ్య ఆలయం ప్రసిద్ధి, ఏటా మహాశివరాత్రి పురస్కరించుకొని స్వామివారి తిరునాళ్ల, కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. మల్రాజు వెంకటరామకృష్ణ కొండలరావు బహద్దూర్, మల్రాజు ప్రశాంతరావు బహద్దూర్ వ్యవస్థాపక ధర్మకర్తలుగా ఉన్న ఈ ఆలయానికి ప్రధాన అర్చకుడిగా కొండకావూరి వెంకట్రామయ్య శర్మ స్వామివారి సేవలందిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25వతేదీ నుంచి మార్చి 3 వరకు వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి కెక్కిన ప్రముఖ ఆలయం కావడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచే కాక, ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు.

11వ శతాబ్దం నాటి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

మండలంలోని నర్సింగపాడు గ్రామంలో క్రీస్తుశకం 11వ శతాబ్దంలో మునీశ్వరులచే ప్రతిష్ఠించబడినట్లుగా చరిత్ర కలిగిన ఆలయం శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయం. స్వామివారికి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. ఇప్పటికీ రాత్రిళ్లు మహర్షులు వచ్చి స్వామివారిని సేవిస్తారని ప్రతీతి. అన్నపూర్ణాదేవి అమ్మవారు దక్షిణముఖంగా ఉండడం మరో విశేషం. నవగ్రహాలలో రాహు-కేతు పూజలు ప్రతి ఆదివారం నిర్వహిస్తారు. ఆలయానికి ప్రధాన అర్చకులుగా కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ స్వామివారి సేవలు అందిస్తున్నారు. ఏటా కార్తిక మాసంలో మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఏటా నిర్వహించే 121 కలశాల అభిషేకాలు, కోనేటిలో తెప్పోత్సవం, ప్రతినెలా మాసశివ రాత్రి పూజలకు ఈ ఆలయంలో ప్రత్యేకత. ఈ ఏడాది మహాశివరాత్రి పురస్కరించుకొని విశేష పూజలు, మహా అన్నదాన కార్యక్రమం చేపట్టను న్నారు.



నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయం

కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



అమరావతి: చట్టసభల్లో పేద ప్రజల సమస్యలపై ప్రశ్నించే కేఎస్ లక్ష్మణరావును ఈనెల 27వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ ప్రతినిధుల బృందం కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేపి లక్ష్మణరావును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు రవిబాబు మాట్లాడుతూ పట్టభద్రులందరూ సామాజిక సమస్యలపై అవగాహన కలిగిన కేఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. సీఐటీయూ నేత బి.సూరిబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న కేస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకుడు గర్నెపూడి సురేష్, ఆవాజ్ నాయకుడు సయ్యద్ మోహిద్దీన్‌వలి తదితరులు పాల్గొన్నారు

పాఠశాల సంసిద్ధతపై శిక్షణ

ముప్పాళ్ళ: మండలంలోని మాదల, ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ జ్ఞానజ్యోతి 120 డేస్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణా కార్యక్రమం లో భాగంగా ఐదవ రోజు సోమవారం పాఠశాల సంసిద్ధత మేళాపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో భాగంగా ఈసీసీఈ ప్రాముఖ్యత, అసెస్మెంట్ కార్డు గురించి అంగన్‌వాడీ కార్యకర్తలచే డెమో చేయించారు. శిక్షణా తరగతులను తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఐసీడీఎస్ ఏసీడీపీఓ సంతోషకుమారిలు పరిశీలించారు. జిల్లా కో ఆర్డినేటర్ వి.రవిచంద్ర, డీఆర్పీలుగా జి.జయలక్ష్మి, ఎం.అనంతలక్ష్మి, ఎస్.స్వర్ణలత, వై.యోగానంద, షేక్ సుభానిలు వ్యవహరించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- సెయింట్‌పాల్ ఎఫిఫానియా శతవార్షిక లూథరన్ దేవాలయ పండుగ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే
- ఘనస్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



అచ్చంపేట వీధులలో అశేష జనవాహిని నడుమ మాజీ ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: నేను మీతోనే ఉంటా... అందరికీ అందుబాటులో అండగా తోడుగా ఉంటా.. ఈరోజు నన్ను ఏసుక్రీస్తే ఇక్కడకు రప్పించారు.. మనమందరం ఏసు మార్గంలో నడుద్దాం.. అని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం జరిగిన సెయింట్ పాల్ ఎఫిఫానియా శతవార్షిక లూథరన్ దేవాలయ పండుగ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రూ.కోటిన్నర వ్యయంతో నిర్మించిన చర్చిలో జరిగిన వేడుకలను మాజీ ఎమ్మెల్యే తిలకించారు. ఈ సందర్భంగా చర్చ్ ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి శంకరరావును ఆశీర్వదించారు. ఉత్సవ నిర్వాహకులు శంకరరావుకు ఘనస్వాగతం పలికారు. దుశ్శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ అధికారం ఉన్నా, లేకపోయినా అందరికీ అండగా ఉంటానన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులలో నూతనోత్సాహం

మాజీ ఎమ్మెల్యే శంకరరావు రాకతో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చింది. మండల నలుమూలలనుంచి అభిమానులు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. చూస్తుండగానే అచ్చంపేట వీధులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో నిండిపోయాయి. మాజీ ఎమ్మెల్యే నంబూరి శంకరరావు పంచాయతీ కార్యాలయం నుంచి వేలాదిమంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలినడకన ఎస్సీ కాలనీలోని చర్చికి తరలి వెళ్లారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం అశేషంగా తరలి వచ్చిన భక్తులతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు ఈదా సాంబిరెడ్డి, సీహెచ్‌ఆర్కే సాయిరెడ్డి, అచ్చంపేట, పెదకూరపాడు, బెల్లంకొండ, క్రోసూరు మండలాలల ఎంపీపీలు గంగసాని నరశింహారెడ్డి, బెల్లంకొండ మీరయ్య, వెంకటేశ్వరరెడ్డి, పి.కోటయ్య, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, మైనారిటీ సెల్ కన్వీనర్ షేక్ బీరువాల జాని, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి షేక్ కమల్ సైదా, క్రోసూరు జడ్పీటీసీ గఫూర్, వ్యవసాయ వర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ గ్రామాల కన్వీనర్లు వేలాదిగా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రోసూరులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నంబూరు శంకరరావు

అందరికీ అందుబాటులో ఉంటా..

క్రోసూరు: తనపై, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అడుగడుగునా అభిమానం చూపిస్తూ ఆదరిస్తున్న పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు తాను అధికారంలో ఉన్నా, అధికారం లేకున్నా ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. సోమవారం అచ్చంపేటలో చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తూ క్రోసూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులను ఆయన కలుసుకున్నారు. అధైర్యపడొద్దని అందరికీ అండగా ఉంటానని అభయమిచ్చారు. టీడీపీ మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు వారికి ఓటేశారని, అయితే నేడు రైతులు, విద్యార్థులు, కూలీలు అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరూ సమైక్యంగా ఉండి టీడీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కొందామన్నారు. తొలుత నంబూరు శంకరరావుకు పార్టీ కార్యకర్తలు, యువకులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. గార్లపాటి దాసు, మండల కన్వీనర్ వెలది అప్పారావు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, అనుమల కోటిరెడ్డి, షేక్ ఖాదర్, తుమ్మపూడి ప్రతాప్‌రెడ్డి, ఏసురెడ్డి, మంగిసెట్టి కోటేశ్వరరావు, హరిబాబు, అచ్చంపేట జెడీటీసీ విజయప్రతాప్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల నిరసన

న్యాయవాద చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం న్యాయవాద చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నాలుగు కోర్టుల్లో విధులను బహిష్కరించి సోమవారం పట్టణంలోని తాలూకా న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం న్యాయవాద చట్టం(1960)ను సవరణ చేయాలనే ఉద్దేశంతో బిల్లును తయారు చేయటాన్ని న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. నిరసనగా విధులు బహిష్కరించి నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. న్యాయవాదులు బి.ఎల్. చిన్నయ్య, కళ్ళం వీర భాస్కరరెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, విజయ్ కుమార్, రాజశేఖరుని గోపాల కృష్ణమూర్తి, బి.అమర్ నాయక్, షేక్ నాగూర్ బాబు, బాదరబోయిన వెంకటేశ్వరరావు, పిట్టల సురేష్, షేక్ నాగులా, జ్యోతి బాబు పాల్గొన్నారు.



న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి

సత్తెనపల్లి నూతన మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్

సత్తెనపల్లి: జిల్లాలోనే సత్తెనపల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.ఆనంద్ కుమార్ అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ పదోన్నతి పై గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి పొంది బదిలీపై సత్తెనపల్లి నూతన కమిషనర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సత్తెనపల్లి పురపాలకు సంఘంలో అందుతున్న సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రధానంగా శానిటేషన్, వాటర్ సప్లయి, బ్యూటిఫికేషన్ పై దృష్టి సారిస్తానన్నారు. ప్రజలు రోడ్ల పై చెత్తపడేయకుండా డస్ట్ బిన్ ల్లో వేయాలని, లేకుంటే పురపాలక సంఘ కార్మికులకు అందించాలన్నారు. కమర్షియల్ వ్యాపారులు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందరి సహకారంతో సత్తెనపల్లిని ప్రత్యేక స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌ను మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, వివిధ సెక్షన్ హెడ్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

కట్టమూరులో విషాద ఛాయలు

సత్తెనపల్లి: గుంటూరు జిల్లా పెదకాకాని కాశీ గార్డెన్స్ రోడ్ లో గల గోశాల వద్ద విద్యుదాఘాతంతో నలుగురు మృతిచెందగా వారిలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామానికి చెందిన మందాడి కాశీబాబు (50) ఉన్నాడు. కట్టమూరు గ్రామానికి చెందిన మందాడి ముకుందరావుకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు మందాడి హనుమంతరావు వ్యవసాయ పనులు చేస్తుండగా, రెండవ కుమారుడు మృతుడు మందాడి కాశీబాబు పెదకాకాని వద్ద గల గోశాలలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. మూడో కుమారుడు అమ్మకాశీ అమెరికాలో డాక్టర్‌గా సేవలందిస్తున్నాడు. మృతుడు కాశీబాబుకు భార్య నాగేంద్రమ్మ, కుమారుడు జితేంద్ర, కుమార్తె లావణ్య ఉన్నారు. కుమారుడు జితేంద్ర, కుమార్తె లావణ్య ఇరువురు అమెరికలో ఎంఎస్ చేస్తున్నారు. 12 ఏళ్ల నుంచి మందాడి కాశీ బాబు గోశాలలో సూపర్‌వైజర్‌గా సేవలందిస్తున్నాడు. సోమవారం సంపులో పూడిక తీస్తుండగా విద్యుదాఘాతం సంభవించి జరిగిన ప్రమాదంలో మందాడి కాశీబాబు కూడా మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుతో విలపిస్తున్నారు.

పొలాల్లో వ్యర్థాలను తగలబెట్టొద్దు

రాజుపాలెం: రైతులు తమ పంటపొలాల్లో వ్యర్థాలను తగులబెట్టవద్దని, అలా చేస్తున్న క్రమంలో పొలాలపైన ఉండే విద్యుత్ తీగలను గమనించాలని విద్యుత్‌శాఖ మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూతలపాటి శింగయ్య సోమవారం తెలిపారు. మండలకేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ పొలంలోను విద్యుత్ మోటర్లు, విద్యుత్ తీగలు ఉన్నందున పొలాల్లో వ్యర్థాలను తగలబెట్టరాదని రైతులను కోరారు. పొరపాటున మంటలు కరెంటు వైర్లకు తగిలినచో సమీపంలో ఉన్న రైతులకు ప్రమాదం జరగవచ్చని, విద్యుత్ శాఖకు భారీ నష్టం జరుగుతుందని, రైతులు గమనించాలని సూచించారు.

గుర్తుకొస్తున్నాయి..!

గురుకుల పాఠశాలలో అ'పూర్వ' సమ్మేళనం



అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2003-2008 విద్యాసంవత్సరాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో కలసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి గురువులను సమావేశానికి ఆహ్వానించి జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు తాము అండగా ఉంటామంటూమని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు తమ బ్యాచ్ తరఫున ఇన్వర్టర్ బహూకరించారు. వంద కిలోల బియ్యాన్ని నల్లపాటి ఆంజనేయులు స్పాన్సర్ చేశారు. అప్పటి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, ప్రస్తుత ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతితో బోధనా విధానాల్లో మార్పులు

సత్తెనపల్లి: జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా నూతన విద్యా విధానంలో ఏ విధంగా బోధించాలనేది జ్ఞాన జ్యోతి ద్వారా తెలియజేస్తున్నారని, దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధించే విధానంలో మార్పు తప్పకుండా వస్తుందని ఐసీడీఎస్ సత్తెనపల్లి సీడీపీఓ టి.శ్రీలత అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండోదశ నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో సోమవారం ఆమె హాజరై మాట్లాడారు. ఆటపాటలతో బోధించే విధానం చిన్నారులను ఆకట్టుకుంటుందన్నారు. ఆటల ద్వారా అభ్యాసం ఈ శిక్షణా లక్ష్యాల్లో ఒకటన్నారు. ఐసీడీఎస్ సత్తెనపల్లి ఏసీడీపీఓ సంతోష్ కుమారి మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఐసీడీఎస్ సత్తెనపల్లి సూపర్‌వైజర్ పి.ప్రమీల మాట్లాడుతూ పిల్లలకు ఆటలు, పాటలు, చిత్రాల ద్వారా బోధిస్తే సులభంగా విద్య అందుతుందన్నారు. డీఆర్పీలు పి.ప్రమీల, హఫీజ్, విజయభాస్కర్‌లు శిక్షణ ఇచ్చారు. ముందుగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతిలో పట్టపగలు చోరీ

అమరావతి: పట్టపగలే అమరావతి నడిబొడ్డులో ఉన్న మునుసబు గారివీధిలో దొంగతనం జరగటంపై గ్రామస్తులు భయందోళనలకు గురయ్యారు. గ్రామస్తుల కథనం ప్రకారం స్థానిక అమరేశ్వరస్వామివారి దేవాలయంలో వేద పండితుడిగా పనిచేస్తున్న లంకా సోమేశ్వరశర్మ మునుసుబు గారి బజార్‌లో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం సుమారు 3.30గంటల సమయంలో ఇంటిలో పెద్దలందరు నిద్రలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి హాల్‌లో టీవీ ముందు పెట్టిన రూ.30వేలు నగదు, రెండు బంగారు ఉంగరాలను దొంగిలించాడు. అనంతరం గమనించిన బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై ఇంతవరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.

7న జీవధ్వజ ప్రతిష్ఠా మహోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని వడవల్లి వీరాంజనేయ స్వామివారి దేవస్థానం జీవధ్వజ ప్రతిష్ట మహోత్సవం మార్చి 7న ఉదయం 7:15 గంటలకు జరుగుతుందని కార్యనిర్వాహణాధికారి సనిమెళ్ల కోటిరెడ్డి సోమవారం తెలిపారు. మార్చి 5న ఉదయం 6 గంటల నుంచి వివిధ పూజాకార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.